
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 12, మే, 2025



సోమశిలలో 49.706 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 49.706 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4030, ఉత్తర, దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.99,800
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.9,045
3శాతం జీఎస్టీతో	రూ.9,316
నవర (8గ్రా)	రూ.74,528

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.7 /29.5

వాతావరణం జిల్లాలో సోమవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 55 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 24,835 మంది విద్యార్థులు



సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌ఐఓ

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్‌ఐఓ వరప్రసాదరావు జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్యలతో సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 65 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 24,211 మంది జనరల్, 624 మంది ఒకేషనల్ కలిపి మొత్తం 24,835 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 21,068 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 3,767 మంది హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష జరగనుంది. ఇంటర్ పరీక్షల కోసం కంట్రోలు రూం నంబరు 0861–2320312 ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే ఈ నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని ఇంటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో సీసీ కెమెరాలను బిగించనున్నారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

రెండోకారుకు రికార్డ్ స్థాయిలో నీరు



మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: ఈ ఏడాది 5.24 లక్షల ఎకరాలకు రెండోకారుకు సాగునీరు అందిస్తున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం ఆత్మకూరు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గతంలో అత్యధికంగా 1.80 లక్షల ఎకరాలకు మాత్రమే రెండోకారుకు సాగునీరు అందించినట్లు, దానికి మూడు రెట్లుగా ఈ ఏడాది రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని సాగునీరు విడుదల చేశామన్నారు. నాన్ డెల్టాకు నాలుగు కాలువల ద్వారా 1.64 లక్షల ఎకరాలకు 16 టీఎంసీల నీటిని కేటాయించి విడుదల చేశామన్నారు. పెన్నాడెల్టాకు 2 లక్షల ఎకరాలకు 22 టీఎంసీల నీటిని కేటాయించినట్లు వివరించారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన మురళీ అనే సైనిక వీరుడికి నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కేశవ చౌదరి, ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ములుమూడిలో రెండువర్గాల కొట్లాట

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలో ఓ వివాహ వేడుక సమయంలో చెలరేగిన గొడవ మరుసటిరోజు రెండువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. రూరల్‌లోని ములుమూడి గ్రామంలో శనివారం వివాహ వేడుక జరిగింది. ఈ క్రమంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన యువకులు గొడవకు దిగారు. పెద్దలు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పి పంపించేశారు. అయితే ఆదివారం టీడీపీ వర్గానికి చెందిన యువకులు కొందరు వైఎస్సార్‌సీపీకి చెందిన యువకులను దుర్భాషలాడి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో యువకులు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో గ్రామస్తులు వారిని సముదాయించారు. ఈ విషయంపై రెండు వర్గాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. పోలీసులు విచారణ చేస్తున్నారు.

మితిమీరిన వేగంతో కారు బీభత్సం

నెల్లూరు(క్రైమ్): ఓ ఇన్నోవా కారు నడిపే వ్యక్తి ఆదివారం రాత్రి నగరంలో బీభత్సం సృష్టించారు. మితిమీరిన వేగంతో ఆత్మకూరు బస్టాండు నుంచి ఓల్డ్ చెక్‌పోస్టు వైపు వాహనాన్ని పోనిచ్చారు. కారును ఆపేందుకు యత్నించినా వినకుండా అందులోని వ్యక్తి ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొనే ప్రయత్నం చేయడంతో ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు కారును వెంబడించి ప్రశాంతినగర్ జాతీయ రహదారి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జలం.. విషతుల్యం

రొయ్యల శుద్ధి కంపెనీలు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. శుద్ధి కోసం ఉపయోగించే రసాయనాలతో కూడిన వ్యర్థాలను సాగునీటి కాలువల్లోకి వదిలేస్తున్నారు. దాంతో సాగుభూములు విషతుల్యంగా మారిపోతున్నాయి. తాగునీరు కలుషితమై వాటిని తాగితే ప్రమాదకరమైన వ్యాధులు సోకుతున్నాయి.



- సాగునీటి కాలువల్లోకి రొయ్యల కంపెనీల వ్యర్థాలు
- మృత్యువాత పడుతున్న మత్స్యసంపద
- చౌడు బారుతున్న 20 వేల ఎకరాల సాగు భూములు
- కలుషిత నీటితో పశువులూ మృతి
- లబోదిబోమంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేట, జగదేవిపేట గ్రామాల పరిధిలో ఉన్న స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్స్, సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల నుంచి వచ్చే రసాయన వ్యర్థ జలాలను గంగపట్నం – మైపాడుకు వెళ్లే పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ ఫ్యాక్టరీలలో రొయ్యల ప్రాసెసింగ్ జరుగుతుంది. ఈ క్రమంలో వాటిలో రసాయనాలు ఉపయోగిస్తారు. ప్రక్రియ పూర్తయిన తరువాత బయటకు వచ్చే రసాయన వ్యర్థాలతో కూడిన నీటిని పంట కాలువల్లోకి వదలడంతో అవి నేరుగా చెరువుల్లోకి చేరుతోంది. దాంతో చెరువుల్లో నీరు విషతుల్యమై మత్స్యసంపద చనిపోతోంది. ఇటీవల గంగపట్నం, కొమరిక, నరసాపురం గ్రామాల చెరువులలో చేపలు మృత్యువాతపడి రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

నిబంధనల ఉల్లంఘన

జిల్లాలో 33,128 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఆ రంగానికి అనుబంధంగా పది వరకు రొయ్యల ప్రాసెస్ యూనిట్లు, 61 సీడ్ ప్లాంట్‌లు, 22 సీడ్ హేచరీలు ఉన్నాయి. ఆయా ప్రాసెస్ యూనిట్లు, హేచరీల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. చాలా వరకు పీసీబీ ప్రమాణాలు పాటించడం లేదు. యూనిట్ల నుంచి వచ్చే రసాయనాలు కలిసిన వ్యర్థాలు పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీనివల్ల భూములు చౌడు బారి బీళ్లుగా మారిపోతున్నాయి. పంట ఎదుగుదల క్షీణించిపోతోంది. రసాయన వ్యర్థాలు భూగర్భంలోకి ఇంకి తాగు నీరు కూడా కలుషితమతుతోంది.

ఎక్కడెక్కడ ఏం జరుగుతోందంటే..

- టీపీగూడూరు మండల పరిధిలో ఉన్న శరత్ రొయ్యల ప్రాసెస్ యూనిట్ నుంచి రసాయనాలతో శుద్ధి చేసిన వ్యర్థ జలాలను ఈదూరు, కోడూరు జాయింట్ చెరువు నుంచి వెళ్లే పంట కాలువలోక్లి వదిలేస్తున్నారు. ఆ కాలువ కింద దాదాపు 5 వేల ఎకరాలు సాగవుతోంది. రసాయనాలు కలిసిన నీరు పంటపొలాల్లోకి వెళ్తున్నాయి.
- వెంకన్నపాలెంలో ఉన్న శరత్ సీడ్ ప్లాంట్ నుంచి వచ్చే రసాయనాల నీరు బకింగ్‌హాం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు. కోడూరు బీచ్ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన జేజే మెరైన్, సాయి ఆక్వా, ఇండో మెరైన్, భవాని హేచరీ, ఆదిత్య హేచరీల నుంచి వ్యర్థ జలాలు బకింగ్‌హాం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు. రసాయనాల కలిసిన వ్యర్థ జలాలు కాలువలో కలిసిపోవడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోంది.

కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలంలో ఏర్పాటైన హేచరీలు

ఆంజనేయ, గ్రీన్ హౌస్, పెడోరాల నుంచి విడుదల చేసే వ్యర్థజలాలు కూడా మలిదేవి డ్రెయిన్‌లో వదిలేస్తున్నారు. ఆ డ్రెయిన్ పరిధిలో ఆలూరుపాడు, మోదేగుంట, మానేగుంటపాడు గ్రామాల పరిధిలోని దాదాపు 300 ఎకరాల ఆయకట్టులో పంటలు సాగవుతున్నాయి. రసాయనాలు కలిసిన జలాలు డ్రెయిన్‌లో కలవడం వల్ల ఆ నీరు పారే భూములు చౌడుతేలి పంటల ఎదుగుదల క్షీణించి రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

- గండవరం వద్ద ఏర్పాటు చేసిన ఆల్ఫా మెరైన్ ప్రాసెస్ యూనిట్ నుంచి వచ్చే రసాయన వ్యర్థ జలాలు పైడేరు కాలువలోకి వదిలేస్తున్నారు. దాని పరిధిలో అల్లూరు మండలంలోని నార్తుమోపూరు, ఆములూరు గ్రామాలకు చెందిన 800 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇలా అధిక శాతం ప్రాసెస్ యూనిట్లు, సీడ్ హేచరీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి.



గంగపట్నం చెరువులో చనిపోయిన చేపలు (ఫైల్)

ఇలా చేయాలి..

రొయ్యల శుద్ధి కేంద్రాల్లో రియల్ టైం పొల్యూషన్ తెలిపే ఆర్‌టీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తూము ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన వ్యర్థ జలాలను అందులోకి పంపించాలి. కానీ ఆ ప్లాంట్ ఏర్పాటు ఖర్చుతో కూడుకుంది కావడంతో ప్లాంట్ యజమానులు నేరుగా బయట పంట కాలువలలోకి వదిలేస్తున్నారు. వాస్తవంగా రొయ్యల శుద్ధిలో ఏడు రకాల రసాయనాలు వాడతారు. పీసీబీ ప్రమాణాలకు లోబడి శుద్ధి చేయాలి. శుద్ధి చేసిన వ్యర్థాలను డిస్పోజ్ కంపెనీకి అప్పగించాలి. కానీ వాటిని అనధికారికంగా బయటకు పంపుతున్నారు.

పశువుల ప్రాణాలు హరీ

రొయ్యల శుద్ధికి సోడియం క్లోరైడ్, అమోనియా లాంటి ప్రమాదకర రసాయనాలు వాడతారు. రొయ్యల నుంచి వచ్చే వ్యర్థాలు మగ్గుతాయి. కుళ్లిన వ్యర్థాలు కలిసిన నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ నీటిని తాగడం వల్ల పశువులకు స్థానిక ప్రజలకు ప్రాణసంకటంలా మారుతోంది. గత పదేళ్లలో వివిధ రకాల వ్యాధులతో రెండు వేల వరకు పశువులు మృతి చెందినట్లు తెలుస్తోంది. వెటర్నరీ వైద్యుల శాంపిల్స్ ల్యాబ్‌లో పరీక్షించగా కలుషిత నీటితో వచ్చే వ్యాధులు సోకినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.

తినే ఆహారమూ విషమే

రసాయనాలు కలిసిన సాగునీటి వల్ల సారవంతమైన పొలాలలో లవణ (ఉప్పు) శాతం పెరిగి చౌడుబారాయి. భూములు చౌడు బారి పంటల ఎదుగుదల తగ్గుతోంది. భూగర్భ జలాల్లోనూ రసాయనాలు కలుస్తున్నాయి. రసాయన జలాలతో పండిన పంట ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, అతిసార, గ్యాస్ట్రో, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

చెరువుపై ఆధారపడి జీవిస్తున్నాం



గంగపట్నం, నరసాపురం, కొమరిక గ్రామాలకు చెందిన మా గిరిజన కుటుంబాలు చెరువులలో చేపల వేట చేసుకొంటూ జీవిస్తున్నాం. కలుషిత నీరు చెరువుకు చేరి చేపలు చనిపోతున్నాయి. దీంతో వేటసాగక ఇబ్బంది పడుతున్నాం.

– నారాయణ (గంగపట్నం)

నీరు కలుషితం కాకుండా చూడాలి



కలుషిత జలాలు చెరువుకు చేరకుండా చూడాలి. లేదంటే చేపలు చనిపోయి నష్టపోతున్నాం. ఇంతకు మునుపు ఒకసారి ఇలానే జరిగింది. అధికారులు చర్యలు చేపట్టి మళ్లీ చెరువు నీరు కలుషితం కాకుండా చూడాలి.

– వెంకటరమణయ్య (గంగపట్నం)

ఇబ్బందులు పడుతున్నాం

పంట కాలువలకు ఫ్యాక్టరీల నుంచి వ్యర్థ నీరు చేరుతోంది. ఈ నీటితో సరిగా పంటలు పండటం లేదు. కలుషిత నీటితో చర్మవ్యాధులు వస్తున్నాయి. రైతులు అడిగితే రెండు మూడు రోజులు నిలుపుదల చేసి తిరిగి మురికి నీటిని యథాతథం కాలువల్లోకి వదిలేస్తున్నారు.

– వెంకట రమణారెడ్డి (జగదేవిపేట)

సప్తశతీ హోమం



సంగం: మండలంలోని కొరిమెర్ల గ్రామంలో నాగవరపమ్మ, పోలేరమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం చండీ సప్తశతీ హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆండాళ్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- గర్భిణి మృతిపై బంధువుల ఆందోళన
- డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

నెల్లూరు(అర్బన్): డాక్టర్ నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసినందువల్లనే జ్యోష్ణ ప్రియ అనే గర్భిణి మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున నెల్లూరులోని ఆండాళ్ ఆస్పత్రి వద్ద ఆదివారం ఆందోళనకు దిగారు. బంధువుల వివరాల మేరకు విడవలూరు మండలం దండిగుంట గ్రామానికి చెందిన వెంకటప్రసాద్ అల్లూరు మండలం గద్దగుంట పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నాడు. ఆయనకు దగదర్తి మండలం కొరుగుంటకు చెందిన జ్యోష్ణ ప్రియతో(24) వివాహం జరిగింది. ఆమె తొలి కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బాబు వయస్సు ఇప్పుడు రెండేళ్లు. తొలి కాన్పు కూడా నెల్లూరులోని ఆండాళ్ ఆస్పత్రిలోనే జరిగింది. ఇప్పుడు మళ్లీ గర్భిణి అయి నెలలు నిండటంతో అదే ఆస్పత్రిలోనే డెలివరీ కోసం చేరింది. డాక్టర్లు సిజేరియన్ చేసి ఆడబిడ్డను తీసి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. పాప ఆరోగ్యంగా ఉంది. అయితే ఆపరేషన్ చేసినప్పుడు తల్లికి సీరియస్ అయింది. ఈ క్రమంలో ఆమెను హుటాహుటిన కిమ్స్(బొల్లినేని) ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు ఆమె మృతి చెందిందని తెలిపారు. దీంతో ఆవేశానికి గురైన జ్యోష్ణ ప్రియ బంధువులు తిరిగి ఆండాళ్ ఆస్పత్రికి వచ్చి ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసినందువల్లనే జ్యోష్ణ ప్రియ మృతి చెందిందంటూ ఘర్షణకు దిగారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరి గొడవ సద్దుమణిగేలా చేశారు. సీఐ సూచనతో డాక్టర్లు మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఉమ్మ నీరు ఎక్కువగా పోవడం, ఇతర ఇబ్బందుల వల్ల ఇలా జరిగిందని డాక్టర్లు వివరించారు. కావాలంటే వేరే డాక్టర్లతో కూడా మాట్లాడాలని కోరారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు బయట ఉండే ఇద్దరు డాక్టర్లతో మాట్లాడారు. అరుదుగా ఇలాంటి సంఘటనలు జరుగుతాయని ఆ డాక్టర్లు కూడా తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

కళ్లకు గంతలతో నిరసన



కళ్లకు నల్లరిబ్బన్లతో పార్టీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం మహిళల మీద చేసిన దాడులకు నిరసనగా వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు కళ్లకు రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెల్లూరు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నగర వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళా నేతలు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు దౌర్జన్యం, అలాగే కంతేరు ఎంపీటీసీ కల్పనను పోలీసులు అరెస్ట్ చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. ఈ రెండు ఘటనల్లో పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యంలో కీచకపర్వంగా ఆమె అభివర్ణించారు. అందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని మహిళలందరూ నిరసన తెలియచేస్తున్నామన్నారు. చంద్రబాబునాయుడుకి ప్రజలు అధికారం ఇచ్చింది ఇందుకేనా అని ప్రశ్నించారు. కార్పొరేటర్ కామాక్షిదేవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు.

మామిడి.. పండితే ఒట్టు

- పక్వానికి రాకుండా లేత కాయల కోత
- ఇథిలీన్ కొడితేనే రంగు
- కాయలు కొని మోసపోతున్న మామిడి ప్రియులు
- పూర్తిస్థాయిలో రాని మామిడి



మామిడి కాయలకు ఇథిలీన్ స్ప్రే

ఉలవపాడు: వేసవిలో మామిడి పండును ఇష్టపడని వారుండరు. ఫలరాజుగా పిలవబడే మామిడి రుచే వేరు. కాని ఇక్కడే మనం పొరబడుతున్నాం. పసుపు రంగులో ఉన్న మామిడి కాయలన్నీ సహజంగా పండినవి కావు. రసాయనాలతో పక్వానికి వచ్చేలా చేసి బయట విక్రయిస్తున్నారు. ముందుగా వచ్చిన పూతలో 5 శాతం పంటకురావడం, ఆ వచ్చిన కాయలను కోసి వ్యాపారం ప్రారంభించారు. ఉలవపాడు మామిడికి ఉన్న బ్రాండ్ కారణంగా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన దుకాణాలలో కాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కాయలను పండించడానికి ఇథిలీన్ ద్రావణాన్ని కాయల మీద స్ప్రే చేస్తున్నారు. అలా చేసిన కాయలు పండినట్లుగా రంగు మారుతున్నాయి. లోపల మాత్రం రుచి ఉండడం లేదు. ముందు వచ్చిన కొన్ని కాయలు కోసిన తరువాత ఇక ఉలవపాడు తోటల్లో కాయలు లేవు. ఇలాంటి పరిస్థితులలో దుకాణాలు ఏర్పాటు చేశారు. కాయలు కావాలి కాబట్టి కాస్త సైజులు ఉన్న లేత కాయలను కోసి అమ్మకానికి పెట్టారు. వాటికి ఇక్కడ స్ప్రే చేయడం వలన అవి పండి పసుపు రంగులో ఉండడం వలన కాయలను వాహనదారులు కొనుక్కుని వెళుతున్నారు.

ఇథిలీన్ స్ప్రే చేస్తేనే..

మామిడి కాయలకు ఇథిలీన్ స్ప్రే చేస్తేనే కాయలు పండుతున్నాయి. ఉలవపాడు హైవేపై ఏర్పాటు చేసిన అన్ని దుకాణాలలో కాయలు పండాలంటే ఇథిలీన్‌ను కొడుతున్నారు. ప్రభుత్వం ఇథిలీన్ ద్వారా పండించవచ్చని అనుమతులు ఇచ్చినా ఈ దుకాణాల్లో నిజంగా ఇథిలీన్‌నే స్ప్రే చేస్తున్నారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. కాయలు మాత్రం పండినా రుచి ఉండడం లేదు. కాయలు ఎలాంటి స్ప్రేలు లేకుండా పండాలంటే కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాత కోయాలి. ఈ విషయమై ఉలవపాడు ఉద్యానశాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ ఇంకో 15 రోజుల్లో కాయలు పూర్తిగా పంటకు వస్తాయి. అప్పుడు మాత్రమే ఇక్కడి కాయలను తీసుకుంటే నాణ్యత రుచి ఉంటుంది.



కొమ్మలు అడ్డువేసి.. కూల్చివేతలు

నెల్లూరు బైపాస్‌రోడ్‌లో అధికారులు కొద్దిరోజులుగా ఆక్రమణలను తొలగిస్తున్నారు. డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అడ్డుగా ఉన్న వాటిని కూల్చివేస్తున్నారు. రహదారిపై వచ్చే వాహనాల వల్ల ఈ పనులకు ఆటంకం కలుగుతున్నందున చెట్ల కొమ్మలను రోడ్డుపై అడ్డుగా వేసి వాహనాలు దారి మళ్లించి పనులు చేస్తున్న దృశ్యం.



వాహనచోదకులకు ఊరట

సూరీడు సుర్రుమంటున్నాడు. కాసేపు కూడా ఎండలో ఉండలేని పరిస్థితి. నెల్లూరు నగరంలోని బీవీనగర్ వద్ద రైల్వేగేట్ పడిన సమయంలో వాహనదారులు ఎండకు అల్లాడిపోయేవారు. అయితే రైల్వే అధికారులు ఇటీవల గ్రీన్‌నెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఎండ వేడి నుంచి వాహనచోదకులకు కాస్తంత ఉపశమనం కలుగుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

కారు బోల్తా పడి వ్యక్తి మృతి


షేక్ నిషార్ మృతదేహం

వలేటివారిపాళెం: కారు అదుపు తప్పి బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చుండి సమీపంలోని కరెంటాఫీస్ దగ్గర శనివారం అర్ధరాత్రి 2.30 గంటలకు జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. అనంతపురానికి చెందిన షేక్ నిషార్ (60) కారులో విజయవాడకు వెళ్తున్నాడు. చుండి సమీపంలోని కరెంటాఫీస్ వద్దకు వచ్చే సరికి కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నిషార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటన స్థలాన్ని చేరుకుని క్షతగాత్రులను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అస్పత్రిలో నిషార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు సమాచారం అందుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం


శ్రీనివాసులు మృతదేహం

కందుకూరు రూరల్: కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన కందుకూరు సమీపంలోని మహదేవపురం అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కందుకూరు పట్టణం బృందావనానికి చెందిన బీ శ్రీనివాసులు (41) బైక్‌పై మహదేవపురం వెళ్లి తిరిగి వస్తున్నాడు. అడ్డురోడ్డు వద్దకు రాగానే సింగరాయకొండ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కందుకూరులోని కోటారెడ్డి ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రగా పని చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్రనాయక్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌ల్లో విస్తృత తనిఖీలు

- అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా


ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికుడి బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రజల భద్రత, నేర నియంత్రణకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఆదివారం జిల్లాలోని రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్‌లు, బస్సులు, జనరద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసు అధికారులు బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లతో జల్లెడ పట్టారు. చొరబాటు దారులను నిరోధించడం, మత్తు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించడం, పేలుడు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, శాంతిభద్రతలకు ముప్పుగా మారే అసాంఘిక శక్తులను గుర్తించడమే లక్ష్యంగా తనిఖీలు కొనసాగాయి. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌ల్లోని ప్రతి ప్రయాణికుడిని వారి వ్యక్తిగత వివరాలతోపాటు ప్రయాణ ఉద్దేశాన్ని అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు కార్డులను పరిశీలించారు. వారి బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్‌లు, ప్యాకెట్లు, పరికరాలను తాకవద్దని, వెంటనే పోలీసులకు లేదా బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రోన్స్‌తో నిఘా పెట్టామన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, నేర నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. అనుమానితులను గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ తనిఖీల్లో జిల్లాలోని పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

కండలేరులో 44.425 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 44.425 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సేవామూర్తులు.. నర్సులు

నేడు ప్రపంచ నర్సుల దినోత్సవం

నర్సులు.. అమ్మకు మించిన సేవామూర్తులు. రోగి శరీరంలో చీము, నెత్తురు, గాయాలు, దుర్వాసనలను భరించి శుభ్రపరిచి, ఉపశమన పరచడంలో నర్సులు సేవానిరతికి నిలువెత్తు రూపాలు. కన్న తల్లి, కట్టుకున్న భార్య లేదా భర్త కూడా చేయలేని సేవలు అందిస్తున్న మానవ రూపంలో కనిపించే దేవతలు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగశీలురు. ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

- రోగుల సంరక్షణలో తల్లికి మించి సేవలు
- జిల్లాలో 6 వేల మందికి పైగా నర్సులు
- కరోనాలో ప్రాణాలు పణంగా పెట్టిన త్యాగశీలురు


పెద్దాస్పత్రిలో విధులు నిర్వహించే నర్సులు

నెల్లూరు (అర్బన్): ఒక డాక్టర్ ప్రాణాలు నిలబెట్టితే.. ఒక నర్సు తన సేవలతో రోగి ప్రాణానికి ధైర్యాన్ని ఇస్తోంది. ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో ఎంతో మంది నర్సింగ్ వృత్తిలోకి వచ్చి తమలోని సేవాతత్పరతను చాటుకుంటున్నారు. మే 12న 1820లో బ్రిటన్‌లో ఉన్నత కుటుంబంలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1854–56 సమయంలో క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి ఆమె స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆ తర్వాత కాలంలో కూడా రాత్రిళ్లు సైతం చేతిలో దీపంతో గాయపడిన సైనికులు ఆమె సేవలతో వేగంగా కోలుకున్నారు. ఆమె అంకితభావం, నిబద్ధత, కృషికి గుర్తింపుగా ఆమె పుట్టిన రోజున ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం 'నర్సుల సంరక్షణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుంది' అనే థీమ్‌ను ప్రకటించి నర్సులకు తగిన గుర్తింపునిస్తూ అవగాహన కార్యక్రమాలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో సోమవారం నర్సులు పండగ వాతావరణంలో నర్సింగ్ డే నిర్వహించనున్నారు.

6 వేల మందికి పైగా నర్సులు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు 6 వేల మందికి పైగా నర్సులు సేవలందిస్తున్నారు. వీరిలో నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలోనే 362 మంది స్టాఫ్ నర్సులు, 27 మంది హెడ్‌నర్సులు, ఎస్ఎన్‌సీయూ నర్సులు 30 మంది ఉన్నారు. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో 35 మంది, కందుకూరు, కావలి ఏరియా ఆస్పత్రులలో మరో 40 మంది నర్సులు పని చేస్తున్నారు. 10 సీహెచ్‌సీల్లో 80 మంది, పీహెచ్‌సీల్లో 166 మంది నర్సులు పని చేస్తున్నారు. వీరు కాకుండా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో 497 మంది బీఎస్సీ నర్సింగ్ చేసిన సీహెచ్ఓలు ఉన్నారు. మరో 1500 మంది వరకు ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. వీరు కాకుండా జయభారత్, నారాయణ, రామచంద్రారెడ్డి ఆస్పత్రి, మెడికవర్, అపోలో, ఎలెన్, కిమ్స్ వంటి ఆస్పత్రుల్లో 3 వేల మందికి పైగా నర్సులు రోగులకు సేవలందిస్తున్నారు.

నేడు సంబరాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం నర్సింగ్ దినోత్సవ సంబరాలను జరుపుకోనున్నారు. కాండిల్స్ వెలిగించి మదర్ ఆఫ్ నర్సింగ్ అయిన ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళులర్పించనున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకోనున్నారు.

సేవలకు సలాం

ప్రమాదాల్లో గాయపడిన వారు, మందు తాగి ఆస్పత్రి పాలైన వారు, ఆపరేషన్లు చేయించుకున్న వారు, డెంగీ, మలేరియా వంటి జబ్బున పడిన వారు మాత్రమే కాకుండా అనేక మంది చీము, నెత్తురుతో కలిసిన గాయాలతో ఆస్పత్రులకు వస్తుంటారు. వీరందరిని పరీక్షించి మందులు రాసేది డాక్టర్. ఆపరేషన్లు చేసేది డాక్టర్ అయితే ఆతర్వాత కోలుకోవడంలో, డ్రెస్సింగ్ చేసి గాయాలు మాన్పించడంలో ప్రధాన భూమిక పోషించేది నర్సులే. కోవిడ్ కాలంలో రాత్రి, పగలు అనే తేడాల్లేకుండా వేలాది మంది రోగులకు తమ ప్రాణాలు పణంగా పెట్టి వైద్య సేవలందించిన వారిలో నర్సుల పాత్ర ప్రధానం.

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రం



నర్సింగ్ వృత్తి అంటే ఎంతో పవిత్రమైంది. జీతం కోసం కాకుండా సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలి. రోగులను తమ మంచి మాటలతో ధైర్యం చెబుతూ వైద్య సేవలందించాలి. 34 ఏళ్ల క్రితం నర్సింగ్ ఉద్యోగంలో చేరాను. నాటి నుంచి నేటి వరకు రోగులకు నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నాను. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టులను భర్తీ చేయాలి. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ విధానంలోనే పోస్టులు భర్తీ చేయాలి.

– వరలక్ష్మి, హెడ్‌నర్సు, జీజీహెచ్, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

రోగులను కాపాడడంలోనే సంతృప్తి



రోగులకు వైద్య సేవలందించి వారి ఆరోగ్యాన్ని కాపాడడంలోనే సంతృప్తి ఉంటుంది. ఒక రోగి తీవ్రమైన అనారోగ్యంతో వచ్చి వైద్య సేవలు పొంది పూర్తి ఆరోగ్యంతో తిరిగి వెళ్లేటప్పుడు ఎంతో అభిమానంగా తమతో మాట్లాడే రెండు మాటలు ఎంతో సంతోషాన్నిస్తాయి. నర్సు అంటేనే సేవకు ప్రతి రూపం. నర్సింగ్ వృత్తిలోకి వచ్చేవారందరూ తమకు మదర్ ఆఫ్ నర్సింగ్ అయిన ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.

– సత్యవతి, సీనియర్ హెడ్ నర్సు, నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

జర్నలిస్టుల అరెస్ట్ ప్రజాస్వామ్యానికి విఘాతం

- అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్‌పీఐ నల్ల రిబ్బన్లతో నిరసన


చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఆర్‌పీఐ నాయకులు

నెల్లూరు రూరల్/ నెల్లూరు సిటీ: జర్నలిస్టులను అన్యాయంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం ప్రజాస్వామ్యానికి విఘాతమని రిపబ్లిక్ పార్టీ ఇండియా (ఆర్‌పీఐ) నాయకులు ఖండించారు. జర్నలిస్టుల అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్‌పీఐ నాయకులు చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకొని ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు మాట్లాడుతూ కావలికి చెందిన నలుగురు విలేకరులను అరెస్ట్ చేసి జైల్లో పెట్టడం అంటే ప్రజల గొంతును నొక్కేయడమేనన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని జర్నలిస్టుల మీద దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని ప్రజా, ప్రభుత్వ ధనాన్ని, సహజ వనరులను దోచుకోవడాన్ని జర్నలిస్టులు ఎక్కడికక్కడ ఎండ కడుతూ అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వ అధికారులకు వారధిగా ఉంటారన్నారు. జర్నలిస్టులు ఎక్కడ ఏ ఘటనలు జరిగిన వాళ్ల ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా ఆ ప్రాంతానికి చేరుకుని అక్కడ వాస్తవాలు తెలుసుకుంటారే తప్ప ఆయా ఘటనలకు వారికి ఏ సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. కావలికి చెందిన విలేకరుల అరెస్ట్ ముమ్మాటికి రాజకీయ కక్షేనని అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడితే ఆర్‌పీఐ జర్నలిస్టుల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరికొండ సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దుంపల సుబ్బారావు, బత్తల మధుసూదన్, జిల్లా కార్యదర్శి వజ్జా సుధాకర్, దాసరి దుర్గాప్రసాద్, హరి, నిమ్మల సుబ్బయ్య, కంచి అశోక్, అచిత్, రాజా, యూత్ జిల్లా అధ్యక్షుడు ముసలి జయరాజ్, ప్రశాంత్, మీడియా ఇన్‌చార్జి బెల్లంకొండ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడిగా జగన్నాథుడి దర్శనం


నరసింహ అవతారంలో జగన్నాథుడు

నెల్లూరు (బృందావనం): నగరంలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాత్రి శ్రీనరసింహ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. తొలుత సంధ్యా హారతి, అనంతరం జగన్నాథ, బలరామసుభద్రలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. జగన్నాథస్వామి నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్‌స్వామి ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 140
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 276
లేయర్ చికెన్ : 187

నిమ్మ ధరలు



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.40
పండ్లు : రూ.25

బంగారు గరుడపై శ్రీవారి చిద్విలాసం


బంగారు గరుడ వాహనంపై తిరుమాడవీధిలో శ్రీవారి చిద్విలాసం

- రారాజుపై యోగనరసింహుని వైభోగం
- భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి రాత్రి బంగారు గరుడవాహనసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన గరుడ వాహనంపై శ్రీవారిని శంఖు, చక్ర, అభయహస్తాలతోపాటు వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా ఆలకరించి కొలువు తీర్చినంతరం భక్తులు దర్శించుకున్నారు. రాత్రి 11 గంటలకు శ్రీవారు బంగారు గరుడ వాహనంపై కోన తిరుమాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు గోవింద నామస్మరణలతో పెంచలకోనలోని వెలుగొండలు మార్మోగాయి. శ్రీవారి గరుడ వాహనం మోసేందుకు భక్కులు పోటీ పడ్డారు. గరుడ వాహన సేవలో ఎలాంటి అపశృతులు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రారాజుపై కొలువు దీరి..

యోగ నరసింహుడు రారాజుపై కొలువు దీరి వైభవంగా ఊరేగారు. ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామికి పూలంగి సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు సింహ వాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి శాంత రూపంలో ఉన్న యోగనరసింహస్వామిగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామికి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి జరిగే గరుడ సేవను తిలకించేందుకు తరలివచ్చిన భక్తజన సందోహంతో పెనుశిల క్షేత్రం కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ అధికారులు చేపట్టారు. తిరుపతి, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామి, అమ్మవార్లను, ఆంజనేయస్వాములను దర్శించుకున్నారు.

యాగశాలలో చతుష్టానార్చన హోమం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న యాగశాలలో ఉదయం చతుష్టానార్చన హోమాన్ని టీటీడీ ఆగమ పండితులు రామానుజచార్యులు ఆధ్వర్యంలో పండితుల బందం నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠ, విశేష హోమాలు నిర్వహించారు. స్వామి తేజస్సు పెంచేందుకు భక్తుల క్షేమ, ఆయురారోగ్యాల కోసం నిర్వహించినట్లు పండితులు చెప్పారు.

కోనలో నవకలశ స్నపన తిరుమంజనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెంచలకోనలో శ్రీవారు, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ దేవేరులకు ఉదయం 11.30 గంటలకు నవకలశ స్నపన తిరుమంజనాన్ని అర్చకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పంచామృతం, పసుపు, కొబ్బరి నీళ్లతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూల నుంచి భక్తులు కోనకు చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. రోగగ్రస్తులు స్వామి వారి కోనేరులో స్నామాచరించారు. పిల్లలు లేని వారు ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న వటవృక్షానికి ఊయలు కట్టి మొక్కుకున్నారు.


సింహవాహనంపై ఆశీనులైన శ్రీవారు

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాత్రి 7 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ దేవేరులను తిరుచ్చిలో ఉంచి శోభాయమానంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సహస్రదీపాలంకరణ మండపంలోకి తీసుకొచ్చారు. అక్కడ 1008 దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లకు వేదపండితులు మంత్రోచ్చరణలు నిర్వహిస్తూ ఊంజల్ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీ శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, సోమయ్య, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి తిరుకల్యాణం

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీవార్లకు పూలంగి సేవ, 9.50 గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు గజవాహన సేవ, రాత్రి 12 గంటలకు ఏకాంతసేవ జరుగుతుందని అధికారులు తెలిపారు.